ఇది కద నిజం
సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక
మీ ప్రాంతంలో జరుగుతన్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
6300490170–9848983329
Www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
* terms and conditions apply

Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక

ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
6300490170–9848983329
Www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets

శనివారం 04-07-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక :17 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## లెక్క తప్పితే రాజీనామా

కేసీఆర్‌కు జూపల్లి సవాల్

సోమాజిగూడకు రావాలన్న మంత్రి

అప్పుల లెక్కపై బహిరంగ సవాల్

రుజువు చేయండి.. లేదంటే

జవాబు ఇవ్వండి

కేటీఆర్‌కు బహిరంగ లేఖ


2 లో

న్యూస్ డెస్క్, 03 జూలై (ఇది కద నిజం): రాష్ట్ర అప్పులపై తాను ఇంతకు ముందు చేసిన ప్రకటనకు కట్టుబడి ఉన్నానని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. దీనిపై బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావు మాట్లాడడం కాదు.. స్వయంగా మాజీ సీఎం కేసీఆర్ స్పందించాలని డిమాండ్ చేశారు. తాను ఆత్మగౌరవం కోసం పని చేస్తానని.. తన ఉద్యోగాన్ని సైతం వదిలేసుకున్నానన్నారు. రాజకీయాలకు వచ్చింది మీలాగా అడ్డగోలుగా మాట్లాడటం కోసం కాదని మండిపడ్డారు. మిమ్మల్ని గౌరవంగా సంబోధిస్తున్నా.. కానీ మీరు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారన్నారు.

## ‘వోకల్ ఫర్ లోకల్’


2 లో

యాత్రికులకు మోదీ లేఖ

5 సంకల్పాలు పాటించండి

స్థానిక ఉత్పత్తులకు ప్రాధాన్యం

‘నేషన్ ఫస్ట్’తో ముందుకు

అమర్‌నాథ్ యాత్రకు శుభాకాంక్షలు

## సింగరేణికి కొత్త జీవం



మిగతాది 2 లో..

10 ఏళ్లలో విస్తరణకు బ్రేక్

కొత్త బొగ్గు బ్లాకులు కోల్పోయిన సింగరేణి

పాత గనులపైనే ఉత్పత్తి భారం

బొగ్గు కొరతతో జెన్‌కోకు ఇబ్బందులు

శ్రావణపల్లి బ్లాక్‌పై ప్రభుత్వ ఫోకస్

సత్తుపల్లి గనుల పునరుద్ధరణకు ప్రయత్నాలు

కేంద్రంతో ముమ్మర చర్చలు

సింగరేణి పునరుజ్జీవనానికి ఐదేళ్ల ప్రణాళిక

నష్టాల నుంచి గట్టెక్కించే కార్యాచరణ

మళ్లీ పూర్వ వైభవమే లక్ష్యం

న్యూస్ డెస్క్, 03 జూలై (ఇది కద నిజం): తెలంగాణ ఆర్థిక, పారిశ్రామిక రంగానికి ఊపిరిగా నిలిచిన సింగరేణి సంస్థ గత పదేళ్లలో దారుణంగా దెబ్బతిన్నది. 137 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన ఈ ప్రభుత్వ రంగ సంస్థ, స్వరాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయికి ఎదగాల్సింది పోయి వ్యూహాల లోపంతో గత పదేళ్లుగా తీవ్రంగా నష్టపోయింది. బొగ్గు మైనింగ్‌లో శతాబ్దానికి పైగా అనుభవం ఉన్నప్పటికీ, రాష్ట్రంలో కొత్త బొగ్గు బ్లాక్‌లు దక్కకుండా నాటి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అడ్డుపడిందనే ఆరోపణలున్నాయి. ఫలితంగా నేడు ప్రభుత్వ రంగ సంస్థలైన జెన్‌కో, సింగరేణి విస్తరణ పూర్తిగా స్తంభించిపోయింది.

సింగరేణిపై ఆంక్షలు..

కేంద్ర ప్రభుత్వం 2015లో దేశంలో బొగ్గు గనుల కేటాయింపునకు వేలం విధానాన్ని తెచ్చినప్పుడు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించిందనే ఆరోపణలున్నాయి. సింగరేణికి ఒడిశాలో కేటాయించిన అత్యంత విలువైన బొగ్గు బ్లాక్‌ల విషయంలో నాటి పాలకులు ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేశారని, దీనివల్ల సింగరేణి సంస్థ తీవ్ర నష్టాన్ని మూటగట్టుకుంటూ ఒడిశాలోని కీలకమైన జేఎంటీ–3 బ్లాక్‌ను, నైనపల్లి బ్లాక్–3ను కోల్పోవాల్సి వచ్చిందని అధికార పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు.

## 2028లో మళ్లీ వస్తా: చంద్రబాబు

జిందాల్ తొలి దశ ప్రారంభం

రాయలసీమను రత్నాలసీమ చేస్తాం

స్టీల్ పేరుతో స్మగ్లింగ్

రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు

రెండేళ్లలో ఉత్పత్తి లక్ష్యం


2 లో

న్యూస్ డెస్క్, 03 జూలై (ఇది కద నిజం): మళ్లీ వస్తానని 2028 జులై 3న జిందాల్ స్టీల్ ప్లాంట్ రెండో దశ పనులను ప్రారంభిస్తానని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. కడప జిల్లా జమ్మలమడుగు లో జిందాల్ స్టీల్ ప్లాంట్ తొలి దశ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ రాయలసీమ ను రాళ్ల సీమను కానివ్వమని, రతనాల సీమ చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు. ఎవరి వల్ల రాయలసీమకు మంచి జరిగిందో ప్రజలు గుర్తించాలని సూచించారు. కియా పరిశ్రమతో అనంతపురం రూపురేఖలు మారిపోయాయని చెప్పారు. ఇప్పటి వరకూ రూ. 19 లక్షల కార్లు తయారయ్యాయని తెలిపారు.

## ఏపీలో గోల్డ్ మైనింగ్‌కు గ్రీన్ సిగ్నల్


2 లో

నాలుగు దశల్లో అన్వేషణ


నాలుగు జిల్లాల్లో తవ్వకాలపై దృష్టి

లక్షన్నర హెక్టార్లలో సర్వేలు

బంగారు నిక్షేపాల వేట

పెట్టుబడులు, ఉపాధికి ఊతం

## ఉన్నత విద్యా ఫీజులపై సర్కార్ కీలక నిర్ణయం



2 లో

ఫీజులకు 10% పెంపు?

కొత్త ఫీజుల ఖరారు వాయిదా

కమిటీ నియామకంలో జాప్యం

అడ్మిషన్లకు అంతరాయం లేకుండా చర్యలు

## బీఆర్ఎస్ అప్పుల బాంబు


2 లో

కేసీఆర్‌కు భట్టి సవాల్

అప్పులపై శ్వేతపత్రం

వడ్డీల భారం రూ.2 లక్షల కోట్లు

బీఆర్ఎస్‌పై భట్టి ఫైర్

సింగరేణిపై విజిలెన్స్ విచారణ

న్యూస్ డెస్క్, 03 జూలై (ఇది కద నిజం): తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మాజీ మంత్రి హరీశ్ రావు పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ అనాలోచిత విధానాలు, అప్పుల కుప్పలపై శ్వేతపత్రం తరహాలో సంచలన నిజాలను వెల్లడించారు. తాము చేసిన అప్పులను, అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకే కేటీఆర్, హరీశ్ రావు ఇద్దరూ ప్రజా ప్రభుత్వంపై ఎదురుదాడికి దిగుతున్నారని మండిపడ్డారు.

అబద్ధాల పునాదులపై పదేళ్ల పరిపాలన..

“హరీశ్ రావు గతంలో ఆర్థిక మంత్రిగా పనిచేశాననే విషయం మరిచిపోయి మాట్లాడుతున్నారు. సోషల్ మీడియా వేదికగా విస్తృతంగా అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాటు అబద్ధాల పునాదులపైనే పరిపాలన సాగించింది” అని భట్టి విక్రమార్క విమర్శించారు.

## లోయలో పడిన బస్సు 40 మంది మృతి


2 లో

## సీఎం విజయ్-త్రిషపై అనుచిత వ్యాఖ్యలు

మాజీ మంత్రి అదుపులోకి

బెయిల్ తిరస్కరించిన హైకోర్టు

త్రిష ప్రస్తావనతో వివాదం

డీఎంకే నేతకు షాక్

తమిళ రాజకీయాల్లో సంచలనం


2 లో

## సెక్రటేరియట్‌లో QR కోడ్ ఎంట్రీ


2 లో

## 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు!

20 నుంచి పార్లమెంట్ సమావేశాలు

రెండు కీలక బిల్లులు

హాట్‌హాట్‌గా వర్షాకాల సమావేశాలు

మహిళా రిజర్వేషన్ బిల్లు?

‘ఒకే దేశం–ఒకే ఎన్నిక’ చర్చ

ప్రభుత్వాన్ని నిలదీసే ప్రతిపక్షం

2 లో

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శనివారం 04-07-2026

# బీఆర్ఎస్ అప్పుల బాంబు

మొదటి పేజీ తరువాయి



బీఆర్ఎస్ హయాంలో చేసిన మొత్తం అప్పు అక్షరాలా రూ.8.21 లక్షల కోట్లు అనీ, ఇందులోనే గత ప్రభుత్వం చెల్లించకుండా వదిలి వెళ్లిన వేల కోట్ల బకాయిలు కూడా ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ భారీ అప్పులపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సమాధానం చెప్పాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సేవాల్ విసిరారు.

వడ్డీల భారమే రూ.2 లక్షల కోట్లు..

గత ప్రభుత్వం చేసిన అప్పుల కారణంగా ప్రస్తుత ప్రభుత్వంపై పడుతున్న భారాన్ని భట్టి వివరించారు. బీఆర్ఎస్ తెచ్చిన అప్పులకు గానూ.. గడిచిన రెండున్నరేళ్లలోనే తాము అసలు, వడ్డీలు కలిపి రూ.2,08,061 కోట్లు చెల్లించాల్సి వచ్చిందని తెలిపారు. ఇంతటి భారీ అప్పులు కడుతూ కూడా, ప్రజా ప్రభుత్వం ఎక్కడా వెనకడుగు వేయకుండా సంక్షేమ పథకాలను నిరంతరాయంగా అమలు చేస్తోందని స్పష్టం చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యధిక వడ్డీలకు తెచ్చిన అప్పులను ప్రస్తుతం తాము రీస్ట్రక్చరింగ్ చేయిస్తున్నామని.. దీనివల్ల ఏడాదికి కట్టాల్సిన వడ్డీ భారాన్ని రూ.34 వేల కోట్ల నుంచి రూ.11 వేల కోట్లకు తగ్గించగలిగామని వివరించారు. కేసీఆర్, హరీశ్ రావులకు గతం లేదు.. భవిష్యత్ లేదు. అందుకే ఉనికి చాటుకోవడానికి ఇప్పుడు హడావిడి పెంచారు" అని ఎద్దేవా చేశారు.

బొగ్గు మాయంపై విజిలెన్స్ విచారణ..

సింగరేణి సంస్థను బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు సంక్షోభంలోకి నెట్టిందని భట్టి విక్రమార్క ఆరోపించారు. "బీఆర్ఎస్ నేతలు సింగరేణి ప్రాంతాల్లో తిరుగుతూ మళ్లీ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. పదేళ్ల కాలంలో సింగరేణిలో కనీసం ఒక్క కొత్త బ్లాక్‌నైనా అందుబాటులోకి తెచ్చారా? ఇన్నాళ్లూ కొత్త బ్లాక్లు రాకుండా అడ్డుకున్నదే బిఆర్ఎస్ నేతలు" అని దుయ్యబట్టారు. సింగరేణి నుంచి కేజీ బొగ్గు కూడా బయటకు వెళ్లే అవకాశం లేదని చెప్తూనే.. గతంలో జరిగిన బొగ్గు మాయం ఆరోపణలపై తాము సీరియస్‌గా ఉన్నామని మంత్రి స్పష్టం చేశారు. దీనిపై ఇప్పటికే సింగరేణి విజిలెన్స్ డైరెక్టర్‌కు పూర్తిస్థాయి విచారణ జరపాలని ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. కొత్త కోల్ బ్లాక్లను సాధించుకునేందుకు ప్రస్తుతం తాము కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నామని, సింగరేణిని కాపాడుకుంటూనే కార్మికుల ప్రయోజనాలను రక్షిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పునరుద్ఘాటించారు.

# లెక్క తప్పితే రాజీనామా

మొదటి పేజీ తరువాయి

హరీష్, కేటీఆర్, కేసీఆర్‌లు సోమాజిగూడకి రావాలని కోరారు. తాను తప్పు చెప్తె రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు.



మీరేం చేస్తారో చెప్పి సోమాజిగూడకి రావాలని డిమాండ్ చేశారు. పౌరుషం ఎవరికి ఉన్నదో తెలుస్తుందని.. పాలమూరు పౌరుషమా..? కల్వకుంట్ల పౌరుషమా అనేది తెలుస్తుంది కదా..? అని మంత్రి ఫైర్ అయ్యారు.

బావ బామ్మర్దులు తాను పారిపోయిన అని అంటున్నారని.. సిగ్గు శరం అని మాట్లాడుతున్నారని మంత్రి జూపల్లి చెప్పారు. "నేను నా మాటకు కట్టుబడి ఉన్నా. ఇప్పుడు కూడా పౌరుషం ఉన్నట్టు మాట్లాడి.. అసలు విషయం దాట వేస్తున్నారు. ఆపరేషన్ సక్సెస్, పేషంట్ డెడ్ అన్నట్టు ఉంది కేటీఆర్, హరీష్ తీరు. అసెంబ్లీలో కేటీఆర్, మేం చేసిన అప్పులు రూ. 3 లక్షల 17 అన్నారు. అదే కేటీఆర్ ఇంకోసారి రూ.3.85 వేల అప్పు అన్నారు. హరీష్ మాట్లాడుతూ

రూ. 4 లక్షల 26 వేల కోట్లు అని ఒకసారి, రూ. 4 లక్షల 17 వేల కోట్లు అప్పు అని ఇంకోసారి చెప్పారు. మీరు చెప్పింది రుజువు చేయండి. నేను చెప్పిన లెక్క తప్పు ఐతే.. నేను రాజీనామా చేస్తా. మీరు చెప్పింది అబద్ధం ఐతే జవాబు రాత పూర్వకంగా చెప్పండి. మీరు చెప్పిన మాటలకు కట్టుబడి ఉన్నారా? నేను చెప్పిన రూ. 8 లక్షల 21 వేల కోట్లుకి కట్టుబడి ఉన్నా. కార్పొరేషన్‌లకు అప్పు తెచ్చింది ఎవరు? మీరు అప్పు తేకుంటే.. ప్రభుత్వం ఖజానా నుంచి ఎందుకు అప్పులు కట్టారు. కేసీఆర్ ఎలాగో అసెంబ్లీకి రావడం లేదు. పోనీ కేసీఆర్‌ను శుక్రవారం మీడియా సమావేశం పెట్టి వివరణ ఇవ్వమనండి. నేను ఇవాళ కూడా సోమాజిగూడకి రావడానికి సిద్ధం. సమాధానం చెప్పాలి. మీరు రుజువు చేయలేకపోతే ఏం చేస్తారో కూడా చెప్పాలి. పార్టీని రద్దు చేసుకుంటాం అని చెప్పండి. సిగ్గుందా శరం ఉందా అంటున్నారు మిస్టర్ కేటీఆర్. పౌరుషం ఉంది కాబట్టే.. ఆ నాడు రాజీనామా చేశా. ఆనాడు రాజీనామా చేశాకే.. పాలమూరులో బీఆర్ఎస్‌కి ఏడు సీట్లు వచ్చాయి. నా చరిత్ర తెలుసుకోండి. సిగ్గు తప్పిన మాటలు మీరు మాట్లాడుతున్నారు." అని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ఈ అంశంపై రాసిన ఓ బహిరంగ లేఖను కేటీఆర్‌కి వాట్సాప్ చేశారు.

# 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు!



**న్యూస్ డెస్క్, 03 జూలై (ఇది కద నిజం):** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జూలై 20 నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది. ఆగస్టు 13 వరకు సుమారు మూడు వారాల పాటు ఈ సమావేశాలు కొనసాగనున్నట్లు సమాచారం. ఈ సమావేశాల్లో మొత్తం 19 సిట్టింగ్స్ నిర్వహించే అవకాశముందని అధికార వర్గాలు వెల్లడించాయి. అయితే దీనిపై క్యాబినెట్ కమిటీ ఆన్ పార్లమెంటరీ అఫైర్స్ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. సాధారణంగా వర్షాకాల, శీతాకాల సమావేశాలు నాలుగు వారాల పాటు జరిగి 20 సిట్టింగ్స్ ఉంటాయి. అయితే గతంలో కొన్ని. సందర్భాల్లో తక్కువ రోజులపాటు సమావేశాలు నిర్వహించిన ఉదాహరణలు కూడా ఉన్నాయి.

హాట్‌హాట్‌గా..

అయితే ఈ వర్షాకాల సమావేశాలు హాట్‌హాట్‌గా కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి. ఆయోధ్య రామమందిర విరాళాల స్కామ్‌పై దుమారం చెలరేగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవల పశ్చిమ బెంగాల్, అసోం, పుదుచ్చేరిలో బీజేపీ విజయాల అనంతరం జరుగుతున్న తొలి పార్లమెంట్ సమావేశాలు ఇవి. మరోవైపు తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే వర్గం)లో చోటుచేసుకున్న తిరుగుబాట్లు కూడా సమావేశాల్లో చర్చనీయాంశంగా మారే అవకాశం ఉంది.

టీఎంసీకి చెందిన 20 మంది, శివసేన (యూబీటీ)కి చెందిన ఆరుగురు ఎంపీలు తమను ప్రత్యేక గ్రూపులుగా గుర్తించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కోరారు. ఈ విజ్ఞప్తిపై స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అలాగే తిరుగుబాటు చేసిన ఎంపీలకు లోక్‌సభలో సీట్ల కేటాయింపుపై కూడా నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. ఇక రాజ్యసభలో కొత్తగా ఎన్నికైన, తిరిగి ఎన్నికైన సభ్యులు ప్రమాణ స్వీకారం చేయడంతో అధికార ఎన్డీఏ కూటమి బలం మరింత పెరిగింది.

కీలక బిల్లులు

వర్షాకాల సమావేశాల్లో ఎన్డీఏ ప్రభుత్వం పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ముఖ్యంగా రెండు రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకురానున్నట్లు తెలుస్తోంది. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు (మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన)ను సవరణలతో మళ్లీ ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ బిల్లులో లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల సభ్యుల సంఖ్యను 50 శాతం పెంచే ప్రతిపాదన కూడా ఉండొచ్చని సమాచారం.

# 'వోకల్ ఫర్ లోకల్' యాత్రికులకు మోడీ లేఖ



**న్యూస్ డెస్క్, 03 జూలై (ఇది కద నిజం):** శుక్రవారం పవిత్ర అమర్‌నాథ్ యాత్ర ప్రారంభమైన సందర్భంగా దేశవిదేశాల నుంచి తరలివస్తున్న శివభక్తులకు భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రత్యేకంగా లేఖ రాశారు. బాబా బర్ఫానీ పవిత్ర దర్శనం లక్షలాది మంది భక్తుల జీవితంలో మరచిపోలేని ఆధ్యాత్మిక అనుభవమని పేర్కొంటూ యాత్రికులందరికీ తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అమర్‌నాథ్ యాత్ర భారతదేశ సాంస్కృతిక ఐక్యతకు, భిన్నత్వంలో ఏకత్వానికి సజీవ నిదర్శనమని కొనియాడారు. కఠినమైన వాతావరణంలోనూ భక్తులకు రక్షణ కల్పిస్తున్న భారత సైన్యం, సీఆర్‌పీఎఫ్, జమ్మూ-కశ్మీర్ పోలీస్, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో పాటు స్థానిక పౌరుల నిస్వార్థ సేవాభావాన్ని ప్రధాని అభినందించారు.

ఈ సందర్భంగా యాత్రకు వెళ్తున్న భక్తులందరూ దేశ శ్రేయస్సును కాంక్షిస్తూ ఐదు ముఖ్యమైన సంకల్పాలను పాటించాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. యాత్రా మార్గంలో పారిశుధ్య నియమాలను పాటిస్తూ స్వచ్ఛతను కాపాడటం, భద్రతా సిబ్బంది సూచనలను గౌరవించడం మొదటి రెండు సంకల్పాలుగా పేర్కొన్నారు. స్థానిక యువత ఉపాధిని దెబ్బతీసేలా కాకుండా 'వోకల్ ఫర్ లోకల్' భావనతో భక్తులు తమ యాత్ర ఖర్చులో కనీసం 10 శాతం నిధులను జమ్మూ-కశ్మీర్ ఉత్పత్తుల కొనుగోలుకే కేటాయించాలని కోరారు. రక్షాబంధన్ నాటికి యాత్ర ముగిసే వేళ 'ఏక్ పేడ్ మా కే నామ్' ప్రచారంలో భాగంగా తోబుట్టువులకు మొక్కలను బహుమతిగా ఇవ్వాలని, 'నేషన్ ఫస్ట్' భావనతో ప్రతి ఒక్కరు విధులను నిర్వర్తిస్తూ 'వికసిత భారత్' నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ప్రధాని మోడీ ఆకాంక్షించారు.

# మళ్లీ 2028లో వస్తా

మొదటి పేజీ తరువాయి



స్టీల్ ప్లాంట్ పేరుతో ఐరన్ ఓర్ స్మగ్లింగ్

గత ప్రభుత్వంలో స్థానికులు 17 వేల ఎకరాల భూమి ఇచ్చారని, అయితే బ్రాహ్మణి స్టీల్ ప్లాంట్ వచ్చిందా అని ప్రశ్నించారు. కానీ స్టీల్ ప్లాంట్ పేరుతో ఐరన్ ఓర్‌ను స్మగ్లింగ్ చేశారని మండిపడ్డారు.వాళ్ల జేబులు నిండాయి కానీ, ప్రజలకు ఉపయోగపడలేదని సీఎం చంద్రబాబు నాయుడు విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో రాయలసీమకు ఇప్పటివరకూ రూ. 4 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయన్నారు. సీమ వనరులతో ఫ్యాక్టరీలు నిర్మించి స్థానికులకే ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం చేపట్టిన ప్రాజెక్టు ద్వారా రెండేళ్లలో ఉత్పత్తి ప్రారంభించాలని అధికారులను, స్టీల్ ప్లాంట్ యాజమాన్యాన్ని ఆదేశించానని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# ఏపీలో గోల్డ్ మైనింగ్‌కు గ్రీన్ సిగ్నల్



**న్యూస్ డెస్క్, 03 జూలై (ఇది కద నిజం):** ఆంధ్రప్రదేశ్‌లో బంగారు ఖనిజ నిక్షేపాల గుర్తింపు, తవ్వకాలపై గనుల శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్రవ్యాప్తంగా లక్షన్నర హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో బంగారు ఖనిజ నిక్షేపాలు ఉండే అవకాశం ఉందని ప్రాథమికంగా అంచనా వేసిన అధికారులు, వాటి అన్వేషణకు కార్యాచరణను వేగవంతం చేస్తున్నారు.

ఇప్పటికే కర్నూలు జిల్లా జొన్నగిరిలో బంగారు ఖనిజ తవ్వకాలు, ఉత్పత్తి కొనసాగుతుండగా, ఇప్పుడు అన్నమయ్య, చిత్తూరు, ప్రకాశం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో కూడా బంగారు నిక్షేపాల అన్వేషణపై గనుల శాఖ దృష్టి పెట్టింది. ఈ ప్రాంతాల్లో ఖనిజ తవ్వకాల ప్రక్రియను నాలుగు దశలుగా (జీ-1, జీ-2, జీ-3, జీ-4) చేపట్టేందుకు ప్రణాళిక రూపొందిస్తోంది.

జాతీయ ఖనిజ అన్వేషణ అభివృద్ధి నిధుల సహకారంతో ఈ అన్వేషణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. తవ్వకాల ద్వారా బంగారు నిక్షేపాల పరిమాణం, నాణ్యతపై స్పష్టత వచ్చిన అనంతరం తదుపరి చర్యలు చేపట్టనున్నారు. ఈ ప్రక్రియ రాష్ట్ర ఖనిజ రంగ అభివృద్ధితో పాటు పెట్టుబడులు, ఉపాధి అవకాశాల పెరుగుదలకు దోహదపడే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.

# సీఎం విజయ్-త్రిషపై అనుచిత వ్యాఖ్యలు..

## మాజీ మంత్రి అరెస్ట్



**న్యూస్ డెస్క్, 03 జూలై (ఇది కద నిజం):** తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతున్న ముఖ్యమంత్రి విజయ్ వర్సెస్ డీఎంకే వివాదం మరో కీలక మలుపు తిరిగింది. సీఎం విజయ్, నటి త్రిషను ఉద్దేశించి అత్యంత వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తిరుచెందూర్ డీఎంకే ఎమ్మెల్యే, మాజీ మంత్రి అనితా రాధాకృష్ణన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఆయన పెట్టుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు తిరస్కరించడంతో ఆత్తూరు పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. జూన్ 20న తూత్తుకుడి జిల్లా ఆత్తూరులో జరిగిన ఒక పార్టీ బహిరంగ సభలో అనితా రాధాకృష్ణన్ ప్రసంగించారు. ఆ సమయంలో తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ హావభావాలను ప్రస్తావిస్తూ విమర్శలు చేశారు. "తాను రాజకీయాల్లోకి వచ్చి అనవసరంగా ఇరుక్కుపోయానని విజయ్ బాధపడుతున్నారు. అసెంబ్లీలో ఆయన ముఖం చూస్తే ఆ విషయమే స్పష్టమవుతోంది. ఇల్లు, సినిమా ఇండస్ట్రీలోనే నటి త్రిషతో ఎంతో సంతోషంగా గడిపిన రోజులను బహుశా ఆయన గుర్తుచేసుకుంటున్నారేమో" అంటూ వ్యక్తిగత జీవితాన్ని లాగుతూ వివాదాస్పద కామెంట్స్ చేశారు.

ఈ వ్యాఖ్యలపై తమిళగ వెట్రి కళగం పార్టీ (టీవీకే) తీవ్రంగా స్పందించింది. ముఖ్యమంత్రిని కించపరిచేలా మాట్లాడిన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని టీవీకే పట్టణ కార్యదర్శి సెల్వం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఆయనపై చట్టప్రకారం కేసులు నమోదు చేశారు. అరెస్ట్ భయంతో అనితా రాధాకృష్ణన్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించగా.. ధర్మాసనం పిటిషన్‌ను కొట్టేసింది. "మీరు సామాన్య పౌరుడు కాదు, ఒక ప్రజాప్రతినిధి. పదవిలో ఉన్నప్పుడు ఎవరైనా సరే ముఖ్యమంత్రికి కనీస గౌరవం ఇవ్వాల్సిందే" అని కోర్టు స్పష్టం చేసింది. 1967 నుంచి తమిళనాడు ప్రజలు సినీ రంగం నుంచి వచ్చిన నేతలను గెలిపిస్తున్నారని, అలాంటప్పుడు ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు.

ఇక, ?కోర్టు ఆదేశాలు వెలువడిన కొద్దిసేపటికే, ఆత్తూరు మున్సిపల్ ఆఫీస్ పరిసరాల్లో ఉన్న అనితా రాధాకృష్ణన్‌ను పోలీసులు చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా డీఎంకే శ్రేణులు పోలీస్ వాహనాన్ని అడ్డుకోవడంతో స్థానికంగా కాసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్రస్తుతానికి ఆయనను ఎస్పీ ఆఫీసుకు తరలించి తదుపరి విచారణ జరుపుతున్నారు. సీఎం విజయ్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత డీఎంకే ముఖ్య నేత ఒకరు ఇలా అరెస్ట్ కావడం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది.

# ఉన్నత విద్యా ఫీజులపై సర్కార్ కీలక నిర్ణయం

**న్యూస్ డెస్క్, 03 జూలై (ఇది కద నిజం):** ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యాశాఖ ఫీజుల నియంత్రణకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఫీజుల నియంత్రణ కమిటీకి చైర్‌పర్సన్ నియామకం ఆలస్యమవడంతో కొత్త ఫీజుల ఖరారు ప్రక్రియ వాయిదా పడింది. దీంతో ప్రస్తుతం అమల్లో ఉన్న ఫీజులకే 10 శాతం పెంపు చేసి కొనసాగించే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం.

ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి ఉన్నత విద్యా కోర్సుల ఫీజులను సవరించే విధానం అమల్లో ఉంది. అయితే కమిటీ ఏర్పాటులో జాప్యం కారణంగా బీటెక్‌తో పాటు ఇతర డిగ్రీ కోర్సుల అడ్మిషన్ల ప్రక్రియ కూడా ఆలస్యమవుతోంది. ఈ పరిస్థితుల్లో విద్యార్థుల అడ్మిషన్లకు అంతరాయం కలగకుండా తాత్కాలికంగా పాత ఫీజులపై 10 శాతం పెంపుతో కొనసాగించే అవకాశాలను ఉన్నత విద్యాశాఖ పరిశీలిస్తోంది. ఈ అంశంపై ప్రభుత్వం త్వరలో అధికారికంగా స్పష్టత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

# లోయలో పడిన బస్సు.. 40 మంది మృతి



**న్యూస్ డెస్క్, 03 జూలై (ఇది కద నిజం):** శుక్రవారం తెల్లవారుజామున పాకిస్తాన్ లో ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. క్వెట్టా నగరం నుంచి పెషావర్ వెళ్తున్న ప్రయాణికుల బస్సు.. వాయువ్య పాకిస్తాన్ లోని పర్వత ప్రాంతంలో నియంత్రణ కోల్పోయి లోయలో పడిపోయింది. ఈ ఘోర ప్రమాదంలో మహిళలు, పిల్లలతో సహా 40 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో 8 మందికి తీవ్రంగా గాయాలవ్వగా.. స్థానికులు, పోలీసులు వారిని అక్కడి నుంచి రక్షించి ఆస్పత్రికి తరలించారు. ఖైబర్ పఖ్తూన్ఖ్వా ప్రావిన్సులోని డేరా ఇస్మాయిల్ ఖాన్ జిల్లా పరిధిలో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదకరమైన మలుపు వద్ద బస్సు బ్రేకులు ఫెయిల్ అయ్యాయని, అందుకే డ్రైవర్ తన వెహికల్ ను నియంత్రించలేకపోయాడని తెలుస్తోంది. రోడ్డుపై వెళ్తున్న బస్సు జారి.. లోయలోకి దూసుకెళ్లడంతో ఘోర ప్రమాదం జరిగింది. ప్రమాదంలో మరణించినవారిని, గాయపడినవారిని గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందని షెరానీ డిప్యూటీ కమిషనర్ వాలి ఖాన్ కాకర్ తెలిపారు. ఈ ఘోర ప్రమాదంపై పాకిస్తాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి వెంటనే మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారుల్ని ఆదేశించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసిన పోలీసులు.. ప్రమాదానికి గల పూర్తి కారణాలపై విచారణ జరుపుతున్నారు.

# సింగరేణికి కొత్త జీవం..10 ఏళ్లలో విస్తరణకు బ్రేక్

మొదటి పేజీ తరువాయి

ఏడాదికి 5 మిలియన్ టన్నుల బొగ్గును వెలికితీసే అవకాశం ఉంటుంది. ఇక సత్తుపల్లి బ్లాక్‌లో 69.65 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలున్నాయి. 8ఏళ్లపాటు ఏటా 4మిలియన్ టన్నుల చొప్పున బొగ్గును తీసేందుకు అవకాశం ఉండేది. ఈ రెండింటిని కోల్పోవడం సింగరేణిపై భారీ ప్రభావాన్ని చూపింది. ఈ రెండు బ్లాక్‌లను నాటి ప్రభుత్వం ప్రైవేట్‌పరం అయ్యేలా రూపాంతరం చెందించడంతో ఇప్పటివరకు అక్కడ మైనింగ్ కార్యకలాపాలు మొదలు కాలేదు.

పాత గనులపై భారం..

రాష్ట్రం ఏర్పడే నాటికి సింగరేణిలో 48 గనులు, సుమారు 59 వేల మంది ఉద్యోగులు ఉండేవారు. అయితే గత 10ఏళ్ల కాలంలో (2014-2023) కొత్త బొగ్గు బ్లాక్‌లు సాధించకపోవడంతో, ప్రస్తుతం ఉన్న గనుల నుంచే సామర్థ్యానికి మించి ఉత్పత్తి చేయాల్సి వస్తోంది. దీనివల్ల పాత గనుల్లో నిల్వలు హరించుకుపోయి 2022 డిసెంబర్ నాటికి గనుల సంఖ్య 48 నుంచి 40కు పడిపోయింది. రాష్ట్రంలో విద్యుత్ గరిష్ట డిమాండ్ 2014లో 5,661 మెగావాట్లు ఉండగా, 2026 నాటికి అది 18,548 మెగావాట్లకు చేరింది. డిమాండ్‌కు తగ్గట్టుగా కొత్త గనులకు లీజులు తీసుకోకపోవడంతో అంతర్గత బొగ్గు కొరత ఏర్పడింది. కొత్తగా 4 వేల మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్లు ప్రారంభించినా, వాటికి అవసరమైన బొగ్గు నిల్వలకు ముందస్తు ప్రణాళికలు లేకపోవడంతో జెన్‌కో ప్లాంట్లపై తీవ్ర ప్రభావం పడింది.

పునరుజ్జీవనం దిశగా..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణి పునరుజ్జీవనానికి విప్లవాత్మక అడుగులు పడ్డాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక నిఘా పెట్టి కొత్త బొగ్గు బ్లాక్‌ల సాధనపై దృష్టి పెట్టారు. సింగరేణి విస్తరణకు కీలకమైన శ్రావణపల్లి బ్లాక్-2 ను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. అలాగే గతంలో ప్రైవేట్ పరమైన కాలయాపన, సత్తుపల్లి గనులను తిరిగి సింగరేణి పరిధిలోకి తేవడానికి చర్యలు చేపట్టారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులను కలవడంతో 32 గనుల చొప్పున బ్లాక్‌ల కేటాయింపు ప్రక్రియ ముగిసింది. నాటి పాలకుల కుట్రల వల్ల జరిగిన నష్టాన్ని పూడ్చుతూ సింగరేణిని మళ్లీ పూర్వ వైభవానికి తీసుకురావడానికి ప్రస్తుత ప్రభుత్వం ఐదేళ్ల బడ్జెట్ ప్లాన్‌తో ముమ్మర కసరత్తు చేస్తోంది.

# సెక్రటేరియట్‌లో QR కోడ్ ఎంట్రీ..

## 24గంటల్లోనే టెక్నికల్ సమస్యలు



**న్యూస్ డెస్క్, 03 జూలై (ఇది కద నిజం):** తెలంగాణ సెక్రటేరియట్ ఎంట్రీ క్యూఆర్ కోడ్‌కు టెక్నికల్ సమస్యలు తలెత్తాయి. స్కానింగ్ రూల్ ప్రారంభించిన 24 గంటలకే టెక్నికల్ సమస్య మొదలైంది. క్యూఆర్ కోడ్ ఇచ్చేందుకు ఓటీపీ రాకపోవడంతో క్యూఆర్ కోడ్ ఎంట్రీని ప్రభుత్వం నిలిపివేసింది. వెంటనే సమస్యను పరిష్కరించాలని మీసేవను ఆదేశించింది. కాగా సచివాలయంలో భద్రతను కట్టుదిట్టం చేసేందుకు ప్రభుత్వం ఇటీవల క్యూఆర్ కోడ్ ఎంట్రీని తీసుకురావాలని నిర్ణయించింది. అపరిచితులు, మోసగాళ్లకు అడ్డుకట్ట వేసేందుకు క్యూఆర్ కోడ్ ఎంట్రీ ఉపయోగపడుతుందని భావించింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో సెక్రటేరియట్‌లోకి రావాలంటే మంత్రులు, అధికారులకు సంబంధించిన పేషీలు ఇవ్వగానే విజిటర్ మొబైల్ ఫోన్‌కు ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్ మెసేజ్ రూపంలో వస్తుంది. గేట్ దగ్గర ఉంటే ఎస్పీఎఫ్ సెక్యురిటీ సిబ్బంది ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన తరవాత లోపలికి అనుమతిస్తారు. అయితే ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ టెక్నాలజీని గురువారం ప్రవేశపెట్టగా మరుసటి రోజే టెక్నికల్ సమస్యలు తలెత్తడం షాకింగ్‌గా మారింది.

## బహదూర్పురా నియోజకవర్గంలో
# ఓటర్ల ఎన్యుమరేషన్ ప్రక్రియ పరిశీలన

ఇది కద నిజం:బహదూర్పురా నియోజకవర్గంలో కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్, టీపీసీసీ ఎలక్షన్ కమిషన్ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ పులిపాటి రాజేష్ కుమార్ పర్యవేక్షించారు. దూద్ బౌలి ప్రాంతంలో జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, డిప్యూటీ కమిషనర్ అరుణకుమారితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2025 సంవత్సరంలో ఓటర్ల జాబితాలో నమోదైన ఓటర్ల ఇళ్లకు నేరుగా వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను అందజేశారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్ జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్యుమరేషన్ ఫారాలను నింపడంలో ఏవైనా ఇబ్బందులు ఉంటే సంబంధిత బూత్ లెవెల్ ఆఫీసర్లను గానీ, ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లను గానీ సంప్రదించాలని కోరారు. పూర్తి చేసిన ఫారాలను ఈ నెల 24వ తేదీ లోపు బూత్ లెవెల్ ఆఫీసర్‌కు తిరిగి అందజేయాలని, లేదా ఎన్నికల కమిషన్ కల్పించిన వెసులుబాటు ద్వారా ఆన్‌లైన్‌లోనైనా ఓటు ఎన్యుమరేషన్ పూర్తి చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బోనాలు శ్రీకాంత్, రామకృష్ణలతో పాటు బూత్ లెవెల్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



# మధుసూదన్ యాదవ్‌కు ఘన సన్మానం

ఇది కద నిజం :దూద్ బౌలి ఉందా బజార్‌లోని శ్రీ పైనీరు ముత్యాలమ్మ దేవాలయ ఉమ్మడి ఉత్సవాల ఊరేగింపు కమిటీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మధుసూదన్ యాదవ్‌ను ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ఆనంద్ గుప్తా, ప్రముఖ నాయకులు నరసింహ ముదిరాజ్, బి. సంతోష్, జి. సుధాకర్, కే. లక్ష్మీనారాయణ తదితరులు నూతన అధ్యక్షుడిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులంతా కలిసి ముత్యాలమ్మ దేవాలయానికి సంబంధించిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. రాబోయే రోజుల్లో ఆలయ ప్రగతికి, ఉత్సవాల నిర్వహణకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు.



# కవిత అరెస్ట్ సమయంలో పోలీసులు అప్రజాస్వామికంగా వ్యవహరించారు

- కవిత అరెస్ట్ పై స్వతంత్ర దర్యాప్తు జరిపెంచాలి
- డీజీపీని కలిసి ఫిర్యాదు చేసిన

### తెలంగాణ రక్షణ సేన నాయకులు



ఇది కద నిజం,హైదరాబాద్ : బోడుప్పల్ లో గురువారం నిర్వహించిన భూ పోరాటం సందర్భంగా తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత దారుణంగా ఉందని పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాము యాదవ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు శుక్రవారం డీజీపీ సీవీ ఆనంద్ ను కలిసి కంప్లైంట్ చేశారు. భూ పోరాటం చేస్తున్న కవిత అరెస్ట్ చేసే సమయంలో పోలీసులు అప్రజాస్వామికంగా వ్యవహరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కవిత సహా టీఆర్ఎస్ మహిళ నాయకులను దుర్భాషలాడుతూ దురుసుగా వ్యవహరించారని తెలిపారు. శాంతియుతంగా నిరసన చేపట్టిన తమ పార్టీ నాయకులపై పోలీసులు కక్షపూరితంగా వ్యవహరించారని ఆరోపించారు. ఈ మొత్తం సంఘటనపై స్వతంత్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కవిత అరెస్ట్ సందర్భంగా జరిగిన తోపులాట, ఉద్రిక్తతకు సంబంధించిన వీడియో ఫుటేజ్ ను, ఫోటోలను ఫిర్యాదుతో జత చేశారు.

# పిట్లం అంగన్వాడీ కేంద్రానికి కుర్చీల విరాళం




ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జూలై 3: కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రానికి పిట్లం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం కుర్చీలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మండల విద్యాధికారి దేవీసింగ్ మాట్లాడుతూ, చిన్నారుల అభ్యాసానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు.

ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ప్రమోద్ టీచర్, కోశాధికారి బాలు, జోన్ చైర్మన్ నారాయణ, డిస్ట్రిక్ట్ చైర్మన్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# పీఆర్‌పీ, పే అప్‌గ్రేడేషన్ అమలు చేయాలి

### ఐదో రోజుకు చేరిన సీఎంఓఏఐ రిలే నిరాహార దీక్షలు




సత్తుపల్లి, ఆర్ సి,జూలై 3 ఇది కద నిజం : సింగరేణి అధికారులకు పెండింగ్‌లో ఉన్న పీఆర్‌పీని వెంటనే విడుదల చేయడంతో పాటు పే అప్‌గ్రేడేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఎంఓఏఐ) ఆధ్వర్యంలో సత్తుపల్లి ఏరియా జీఎం కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం ఐదో రోజుకు చేరుకున్నాయి.

ఐదో రోజు దీక్షలో అడిషనల్ మేనేజర్ గోపి కిషోర్, డిప్యూటీ మేనేజర్ నూకరాజు, సీనియర్ ఇంజనీర్ (సివిల్) రవి కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ అభివృద్ధికి అధికారులు నిరంతరం శ్రమిస్తున్నప్పటికీ, వారి న్యాయమైన డిమాండ్లను యాజమాన్యం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్‌పీని తక్షణమే చెల్లించి, అర్హులైన అధికారులందరికీ పే అప్‌గ్రేడేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు ఉద్యమాన్ని విరమించే ప్రసక్తే లేదని, యాజమాన్యం స్పందించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షలకు సత్తుపల్లి ఏరియాకు చెందిన పలువురు అధికారులు, అసోసియేషన్ నాయకులు, ఉద్యోగులు సంఘీభావం ప్రకటించారు.

# యూరియా పాత విధానంలోనే పంపిణీ చేయాలి: సీపీఎం

సత్తుపల్లి,ఆర్ సి,జూలై 3 ఇది కద నిజం : రైతులకు అవసరమైన మేర యూరియాను కొరత లేకుండా అందుబాటులో ఉంచి, రైతు ఫర్టిలైజర్ యాప్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిలోనే పంపిణీ చేపట్టాలని సీపీఎం జిల్లా నాయకులు మోరంపూడి పాండురంగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సత్తుపల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు ఫర్టిలైజర్ యాప్ కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నెట్‌వర్క్, సాంకేతిక సమస్యలతో ఎరువుల దుకాణాల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ పనులు కీలక దశలో ఉన్న సమయంలో యూరియా కొరత ఏర్పడితే రైతులు తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పాత విధానంలోనే యూరియా పంపిణీ కొనసాగించి, అవసరమైన మేర నిల్వలు ఉంచి సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.




తెలంగాణ రైతు సంఘం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి రావుల రాజబాబు మాట్లాడుతూ, రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేకుంటే రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

విలేకరుల సమావేశంలో సీపీఎం సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కోలికపోగు సర్వేశ్వరరావు, నాయకులు మోరంపూడి వెంకట్రావు, చావా రమేష్, చప్పిడి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో విద్యా ప్రమాణాలపై ఎంఈవో ఫోకస్

### సమయపాలన, అభ్యసన స్థాయిపై ప్రత్యేక ఆదేశాలు



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జూలై 3: కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని మద్దెలచెరువు ప్రాథమికోన్నత పాఠశాల, గౌరారం పాఠశాలలను మండల విద్యాశాఖ అధికారి దేవి సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గత విద్యాసంవత్సరంతో పోల్చితే ఈ ఏడాది విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులు ఫేషియల్ రికగ్నిషన్ హాజరును నిర్ణీత సమయంలో నమోదు చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించిన ఆయన, బోధనలో మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుంక్య, శంకర్, ఉపాధ్యాయులు మధుసూదన్, అరుణ్ కుమార్, జ్యోతి లక్ష్మి, హన్మండ్లు, కృష్ణారెడ్డి, ఎల్లయ్య, ధనుంజయ్, సంధ్య, సీఆర్పీ గోపాల్ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

# జేవీఆర్ ఓసీలో 12 టన్నుల ఎస్కార్ట్ క్రేన్ ప్రారంభం

సత్తుపల్లి,ఆర్ సి,జూలై 3 ఇది కద నిజం : సింగరేణి సత్తుపల్లి ఏరియాలోని జేవీఆర్ ఓసీలో రూ. 22.69 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన 12 టన్నుల సామర్థ్యమున్న ఎస్కార్ట్ క్రేన్‌ను ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. జేవీఆర్ ఓసీ లైట్ మోటార్ వెహికల్ (ఎల్ఎంవీ) సెక్షన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన క్రేన్‌ను ప్రారంభించి, గనుల నిర్వహణలో ఆధునిక యంత్రాల వినియోగం పనితీరును మరింత సమర్థవంతంగా మారుస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో: జేవీఆర్ ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎన్వీఆర్ ప్రహ్లాద్, ఎస్వో టు జీఎం బొల్లం శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్ కె. సోమశేఖర్ రావు, ప్రాజెక్ట్ ఇంజనీర్ డి. శ్రీనివాసరావు, ఎస్వోఎం బి. రాజేశ్వరరావు, మేనేజర్ (ఆపరేషన్స్) జి. కళ్యాణ్ రామ్, సేఫ్టీ ఆఫీసర్ ఎస్. గోవింద్, ఎస్ఈ (ఈడఎం) ముక్కా శ్రీను, డివిజనల్ ఇంజనీర్ (ఈడఎం) పి. గోపి, కాలరీ ఇంజనీర్ జగదీశ్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ ఎస్. సుధాకర్, ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ బి. కోటేశ్వరరావు, సంక్షేమ అధికారులు దారా కావ్య, కె. శ్రీనివాస్‌తో పాటు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల అక్రమ ఫీజుల దోపిడీపై చర్యలు తీసుకోవాలి

### ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ హేమా సుదర్శన్ జిల్లోజు డిమాండ్




ఇది కద నిజం, హైదరాబాద్ :తెలంగాణలోని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ జీవో నంబర్ 1 నిబంధనలను బేఖాతరు చేస్తూ సాగిస్తున్న అక్రమ ఫీజుల దోపిడీపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ హేమా సుదర్శన్ జిల్లోజు డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా విద్యాశాఖ అధికారికి, అలాగే రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధికారులకు పార్టీ ప్రతినిధులు వినతి పత్రాలు సమర్పించారు. ప్రైవేట్ పాఠశాలలు నిబంధనల ప్రకారం తల్లిదండ్రుల కమిటీలను ఏర్పాటు చేయకపోవడం, నెలవారీ సమావేశాలు నిర్వహించకపోవడం, ఫీజుల వివరాలను నోటీస్ బోర్డులపై ప్రదర్శించకపోవడమే కాకుండా వార్షిక ఆడిట్ నివేదికలను ప్రభుత్వానికి సమర్పించకుండా తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడుతున్నాయని ఆమె ఆరోపించారు. తల్లిదండ్రులను ఆర్థికంగా వేధిస్తూ విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై ప్రత్యేక తనిఖీలు జరిపి, అవసరమైతే వాటి గుర్తింపును రద్దు చేయాలని స్పష్టం చేశారు. అంతేకాకుండా, రాష్ట్రంలో విద్యా వ్యవస్థను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ప్రభుత్వం వెంటనే పూర్తి స్థాయి విద్యాశాఖ మంత్రిని నియమించాలని హేమా సుదర్శన్ జిల్లోజు కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ స్టేట్ జాయింట్ ట్రెజరర్ జావిద్ షరీఫ్, సంగారెడ్డి జిల్లా కన్వీనర్ ఉమారాణి, ఉప్పల్ బీరప్ప గడ్డ డివిజన్ ఇంచార్జ్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# పాము కాటుతో తిడుగు గ్రామంలో మహిళ మృతి

జఫర్‌గడ్, జూలై 3 ఇది కద నిజం :

జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం తిడుగు గ్రామంలో విషాదం చోటుచేసుకుంది.నిద్రిస్తున్న సమయంలో పాము కాటుకు గురైన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది.కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు, తిడుగు గ్రామానికి చెందిన మారిపెల్లి సౌందర్య (49), భర్త అంజయ్య, పిల్లలతో కలిసి ఇంట్లో నిద్రిస్తుండగా శుక్రవారం తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో ఏదో కుట్టినట్లు గుర్తించింది.వెంటనే కుటుంబ సభ్యులు పరిశీలించగా ఆమె పడుకున్న బట్టల వద్ద “కట్ల పాము” కనిపించడంతో పాము కాటుగా అనుమానించారు.అనంతరం 108 అంబులెన్స్‌లో వెంటనే వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే వైద్యుల చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం సుమారు 6:10 గంటలకు ఆమె ఆరోగ్యం విషమించి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.మృతురాలి భర్త మారిపెల్లి అంజయ్య ఇచ్చిన ఫిర్యాదులో,పాము కాటు కారణంగానే తన భార్య మృతి చెందిందని, ఈ ఘటనపై ఎవరి మీదా ఎలాంటి అనుమానం లేదని పేర్కొన్నారు.పోలీసులు కేసు నమోదు చేసి, పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించే ప్రక్రియ



Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శనివారం 04-07-2026

# సినిమా న్యూస్

## వెంకీ మాస్టర్ ప్లాన్

ఈ మధ్యకాలంలో సీనియర్‌ల నుంచి జూనియర్ స్టార్ హీరోల వరకు ఒక్కో సినిమాకు ఒకటి, రెండు సంవత్సరాల సమయం తీసుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విక్టరీ వెంకటేష్ మాత్రం బ్యాక్ టు బ్యాక్‌గా వచ్చే రెండు ప్రధాన సీజన్లలో తన సినిమాలను విడుదల చేయడానికి సిద్ధమయ్యాడు. తెలుగు సినిమా పరిశ్రమలో ఎక్కువ శాతం చిత్రాలు సంక్రాంతి, సమ్మర్, దసరా సీజన్లలోనే విడుదలవుతుంటాయి. ఈ సమయంలో ప్రేక్షకులు పెద్ద ఎత్తున థియేటర్లకు రావడంతో స్టార్ హీరోలు కూడా తమ సినిమాలను ఈ సీజన్లలో విడుదల చేయడానికి ఆసక్తి చూపుతుంటారు. అయితే ఇటీవల ఒక సీజన్‌లో సినిమా విడుదల చేసిన హీరో, మరో సీజన్‌లో కనిపించడం అరుదుగా మారింది.



కానీ వెంకటేష్ మాత్రం వరుసగా రెండు ప్రధాన సీజన్లను టార్గెట్ చేశాడు. ప్రస్తుతం వెంకటేష్, త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో రూపొందుతున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రంతో పాటు అనిల్ రావిపూడి దర్శకత్వంలో మరో సినిమాలో నటిస్తున్నాడు. ఇప్పటికే 'ఆదర్శ కుటుంబం' చిత్రాన్ని అక్టోబర్ 2న విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అలాగే అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందనున్న చిత్రాన్ని వచ్చే సంక్రాంతి కానుకగా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. దీంతో వెంకటేష్ వరుసగా దసరా, సంక్రాంతి వంటి రెండు ప్రధాన సీజన్లను టార్గెట్ చేసినట్లు సినీ వర్గాలు భావిస్తున్నాయి. మరి ఈ రెండు సినిమాలతో వెంకీ ఎలాంటి విజయాలను అందుకుంటాడో చూడాలి.



## 60 ఏళ్ల వయసులో ముచ్చటగా మూడోసారి

బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్ ఖాన్ బిగ్ షాకిచ్చారు. తాను ముచ్చటగా మూడోసారి పెళ్లి చేసుబోతున్నట్లు ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. గతంలో రెండుసార్లు పెళ్లి కాగా.. వారితో మనస్పర్థలు రావడంతో విడాకులు తీసుకుని విడిపోయారు. గత కొద్ది కాలం నుంచి ఆయన గౌరీ స్ప్రాట్ అనే ఫ్యాషన్, స్టైలిస్ట్‌తో డేటింగ్ చేస్తున్న విషయం తెలిసిందే. వీరిద్దరు పలు ఈవెంట్స్‌కు కూడా జంటగా హాజరవడంతో పాటుగా కొద్ది రోజుల క్రితమే తమ బంధాన్ని అధికారికంగా ప్రకటించారు. అంతేకాకుండా తన ప్రియురాలిని అందరికీ పరిచయం కూడా చేశారు. ఇక వీరి పెళ్లి వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. తాజాగా, ఈ విషయంపై ఆమిర్ ఖాన్ రియాక్ట్ అయి షాకింగ్ న్యూస్ వెల్లడించారు. ముంబైలో జరిగిన రాజ్‌కుమార్ హిరాణీ సినిమా స్క్రీనింగ్ వేడుకలో పాల్గొన్న ఆయన మీడియాతో ఆమిర్ ఖాన్ మాట్లాడుతూ.. అవును, తనకు జులై 5న పెళ్లి జరుగుతోందని చెప్పారు. అది చాలా చిన్న వేడుక అని, ఇంట్లోనే రిజిస్టర్ మ్యారేజ్ చేసుకుంటున్నామని అన్నారు. జులై 5 తమకు ఎంతో ప్రత్యేకమైన రోజని, కేవలం రెండు కుటుంబాలు, కొందరు అత్యంత ఆప్తమిత్రులు, చిన్ననాటి స్నేహితులు మాత్రమే ఈ పెళ్లికి హాజరవుతున్నారని వివరించారు.

ఈ కొత్త ప్రయాణంలో అందరి ఆశీస్సులు తమకు కావాలని ఆయన కోరారు. తామిద్దరం ఎప్పుడూ సంతోషంగా ఉండేలా దీవించమని మీడియా ద్వారా అభిమానులను వేడుకున్నారు. కాగా. ఆమిర్ ఖాన్‌కు ఇది మూడో పెళ్లి కావడం విశేషం. ఆయన మొదటిసారి 1986లో రీనా దత్తాను వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. అయితే వీరికి జునైద్ ఖాన్, ఐరా ఖాన్ అనే ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. కొద్ది కాలం వీరి కాపురం బాగానే ఉన్నప్పటికీ మనస్పర్థల కారణంగా వీరు 2002లో విడాకులు తీసుకున్నారు. ఆ తర్వాత 2005లో ప్రముఖ దర్శకురాలు కిరణ్ రావును ఆమిర్ రెండో పెళ్లి చేసుకున్నారు. వీరికి ఆజాద్ రావు ఖాన్ అనే కుమారుడు ఉన్నాడు. 16 ఏళ్ల వైవాహిక జీవితం తర్వాత, 2021లో వీరిద్దరూ కూడా విడిపోతున్నట్లు ప్రకటించారు. అయినప్పటికీ, కొడుకు బాధ్యతలను ఇద్దరూ కలిసి చూసుకుంటున్నారు. ఇక రెండోసారి విడాకులు అయ్యాక ఆమిర్ ఖాన్ గౌరీతో ప్రేమలో పడ్డారు. ఇక ఇప్పుడు 60 ఏళ్ల వయసులో పెళ్లి చేసుకోబోతున్నట్లు ప్రకటించడం నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. ఈ విషయం తెలుసుకున్న వారంతా షాక్ అవుతున్నారు. మరికొందరు మాత్రం అప్పుడే కంగ్రాట్స్ చెబుతున్నారు.

## 'ది ప్యారడైజ్' రిలీజ్ డేట్ ఫిక్స్


నేచురల్ స్టార్ నాని కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ప్యారడైజ్'. దసరా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా ఈ సినిమాపై టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆ మధ్య రిలీజ్ చేసిన గ్లిమ్స్ తో సెన్సేషన్ క్రియేట్ చేసింది ప్యారడైజ్. అయితే ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని ఈ ఏడాది ఆగస్టు 21న విడుదల చేయాలని చిత్ర బృందం భావించింది. కానీ షూటింగ్ పెండింగ్ కారణంగా పోస్ట్ పోన్ అయింది.

నెక్ట్స్ రిలీజ్ ఎప్పుడనేదానిపై ఎలాంటి అప్డేట్ ఇవ్వలేదు మేకర్స్. అయితే 'ది ప్యారడైజ్' రిలీజ్ డేట్‌పై ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్స్ కు ఒక కీలక అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ చిత్రాన్ని ఈ ఏడాది సెప్టెంబర్ 25 శుక్రవారం నాడు ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ గా విడుదల చేయడానికి చిత్ర బృందం ప్లాన్ చేస్తుందట. దీనికి ఒక రోజు ముందే అంటే సెప్టెంబర్ 24 గురువారం నాడే భారీ స్థాయిలో ప్రీమియర్ షోస్ ప్లాన్ చేస్తున్నారు. ఈ మేరకు సినిమాకు సంబంధించిన ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్లందరికీ 'ది ప్యారడైజ్' టీమ్ ముందస్తు సమాచారాన్ని అందించింది. రిలీజ్ కు కావాల్సిన ఏర్పాట్లను సిద్ధం చేసుకోవాల్సిందిగా కోరింది. అయితే చిత్రానికి సంబంధించి మిగిలి ఉన్న పనులన్నీ అనుకున్న సమయానికి పూర్తయితేనే ఈ తేదీల్లో సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతుండటంతో మేకర్స్ ప్లాన్ చేసినట్లుగానే సెప్టెంబర్ 25న థియేటర్లలో ఈ సినిమా సందడి చేయడం ఖాయంగా కనిపిస్తోంది.




## దేవిశ్రీ 'ఎల్లమ్మ' సినిమా స్టోరీ లీక్?

బలగం సినిమాతో దర్శకుడిగా బంపర్ హిట్ అందుకున్న వేణు ఎల్దండి.. సరికొత్త ప్రాజెక్టుతో ఇప్పుడు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆ సినిమానే ఎల్లమ్మ. ఎన్నో సంవత్సరాలుగా ఈ ప్రాజెక్టు పైన కూర్చున్నారు వేణు. దిల్ రాజు బ్యానర్ లో వస్తున్న ఈ మూవీలో దేవి శ్రీ ప్రసాద్ హీరోగా ఎంట్రీ ఇవ్వబోతున్నారు. హీరోయిన్ పై ఇంకా క్లారిటీ రాలేదు. సాయి పల్లవి, కీర్తి సురేష్, ఇలా చాలా మంది పేర్లు వినిపిస్తున్నాయి. ఇలాంటి నేపథ్యంలో దేవి శ్రీ ప్రసాద్ హీరోగా చేస్తున్న ఎల్లమ్మ సినిమా స్టోరీ లైన్ వైరల్ గా మారింది.



ఎల్లమ్మను కొలిచే చిందు యక్షగానం కళాకారుల ఫ్యామిలీ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని లిరికిస్ట్ కాసర్ల శ్యాం ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. కుటుంబం, కలలు, గ్రామానికి సంబంధించిన ఎమోషన్స్, తల్లి సెంటిమెంట్, హీరో–హీరోయిన్ లవ్ అన్ని మిళితం కానున్నట్లు ఆయన వివరించారు. ఎల్లమ్మకు, కళాకారులకు ఉన్న సంబంధం ఏంటి అనేది కూడా ఈ సినిమాలో స్పష్టంగా చూపించబోతున్నట్లు వెల్లడించారు. దీంతో ఎల్లమ్మ సినిమా స్టోరీ లీక్ అయినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే ఈ సినిమాలో కూడా తెలంగాణ యాస భాష ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి.